క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: దండుమైలారం 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఇబ్రహీంపట్నం విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు దండుమైలారం గ్రామ ఫీడర్ పరిధిలోని పరిశ్రమలకు, ఫౌల్ట్రీ ఫామ్స్, వ్యవసాయ బావులు, బోర్లకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ అంతరాయన్ని గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా..

యాచారం: విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత కారణంగా ఆదివారం నంది వనపర్తి, నక్కర్తమేడిపల్లి ఇండస్ట్రియల్ ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ సందీప్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు చిన్నారులకు వైద్య పరీక్షలు

ఇబ్రహీంపట్నం: దండుమైలారంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హయత్‌నగర్ కేబీకే కలర్స్ చిల్డ్రన్ హాస్పిటల్ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జెడ్పీహెచ్‌ఎస్‌లో ఈ శిబిరం ఉంటుందన్నారు. డాక్టర్ వాసు, డాక్టర్ నరేశ్‌కుమార్ డాక్టర్ విలియం, భరత్‌కుమార్‌ల వైద్య బృందం పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఆరోగ్య సమస్యలున్న 0–18 సంవత్సరాల లోపు వారికి వైద్య పరీక్షలతోపాటు ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన సాయిలాల్‌నాయక్



బండి సంజయ్‌ను సన్మానిస్తున్న సాయిలాల్

కడ్తాల్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కరీంనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో శనివారం బీజేపీ గిరిజనమోర్చ అధ్యక్షుడు బాణోత్ సాయిలాల్ నాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్‌కి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బార్‌కౌన్సిల్ సభ్యుడిగా కృష్ణగౌడ్



తలకొండపల్లి: బార్ కౌన్సిల్ సభ్యుడిగా జినుకుంట్ల కృష్ణగౌడ్ నియామకమయ్యారు. దేవుని పడకల్‌కు చెందిన కృష్ణగౌడ్ ఇటీవలే 3సంవత్సరాల న్యాయవిద్యను అభ్యసించి లా పట్టా అందుకున్నారు. శనివారం హైదరాబాద్ హైకోర్టులోని బార్ కౌన్సిల్ భవన ప్రాంగణంలో బార్ కౌన్సిల్ ఎన్‌రోల్‌మెంట్ కమిటీ రాష్ట్ర చైర్మన్ కొల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు పిలుపు మేరకు కృష్ణగౌడ్ బార్ కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యాడు. అనంతరం సత్యనారాయణ చేతుల మీదుగా కృష్ణగౌడ్ బార్ కౌన్సిల్ సర్టిఫికేట్, ఐడీ కార్డు అందుకున్నాడు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ రాష్ట్ర క్రియాశీలక కార్యవర్గ సభ్యులు జాకీర్‌హుస్సేన్, కిరణ్ పాలకుర్తి, కార్యదర్శి నాగలక్ష్మీ, పాండురంగారెడ్డి, కృష్ణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



రాజేశ్ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

యాచారం: చిన్ననాటి మిత్రుడు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు స్నేహితులు బాసటగా నిలిచారు. వివరాల ప్రకారం మండల పరిధిలోని గునుగల్ గ్రామానికి చెందిన ముత్యాల రాజేశ్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనతో పాటు గునుగల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పదోతరగతి చదివిన 1998–99 బ్యాచ్ విద్యార్థులు శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.73వేల నగదు, క్వింటాల్ బియ్యం అందజేశారు. మృతుడు రాజేశ్‌కు భార్య, ఇద్దరు బాలికలు సంతానం. భవిష్యత్‌లోనూ అండగా ఉంటామంటూ భరోసా కల్పించారు.



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు



జనం లేక వెలవెలబోతున్న మంచాల ప్రజావేదిక

'ఉపాధి' నిర్వహణలో అవకతవకలు

- కూలీల సంతకాలు లేకుండా రూ.15లక్షలు డ్రా
- ఏళ్లు గడిచినా అందని బిల్లులు

మంచాల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల నిర్వహణలో పెద్ద ఎత్తున అవకతవకలు చోటుచేసుకున్నాయి. కూలీల సంతకాలు లేకుండానే లక్షలాది రూపాయాలు డ్రా చేశారు. శనివారం మంచాల మండల కేంద్రంలో నిర్వహించిన సామాజిక తనిఖీలో అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. అందుకు సంబంధించిన వివరాలు.. మంచాల మండలంలో ఏడాది కాలంలో రూ.3.42కోట్ల పనులు చేశారు. ఈ పనుల నిర్వహణ విషయంలో వారం రోజులుగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీలు చేపట్టారు. శనివారం మంచాల మండల కార్యాలయం ఎదుట మండల స్థాయి ప్రజా వేదిక నిర్వ హించారు. కూలీల సంతకాలు లేకుండానే పనులు చేసినట్లుగా రూ.15లక్షలకు పైగా డ్రా చేశారు. పంచాయతీ రాజ్ పనుల విషయంలో లక్షలు ఖర్చు పెట్టి పనులు చేయించిన కాంట్రాక్టర్లకు ఇప్పటికీ బిల్లులు విడుదలవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పనికి ఒక ఎంబీ మాత్రమే ఉపయోగించాలి. ఇక్కడ పది పనులకు పైగా ఒక ఎంబీనే వాడారు. ఈ అక్రమాలపై ఉన్నతస్థాయి అధికారులతో సమగ్ర విచారన జరిపించి న్యాయం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజలు లేని ప్రజావేదిక

మంచాల మండల కార్యాలయం వద్ద నిర్వహించిన సామాజిక ప్రజా వేదిక కార్యక్రమానికి ప్రజలు రాలేదు. అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది. పంచాయతీ కార్యదర్శుల తోనే సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. అధికారులు సైతం మొక్కుబడిగా కార్యక్రమాన్ని ముగించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నర్మద, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, అడిషనల్ డీఆర్‌డీఓ సుభాషిణి , ఎంపీడీఓ బాలశంకర్, ఏపీఓ వీరాంజనేయులు, ఎస్‌ఆర్పీ వెంకన్న, డీఆర్పీలు మహేశ్, శ్రీనివాస్, రవికుమార్, ఖదీర్, ముఖేశ్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా హన్మంత్‌రెడ్డి



హన్మంత్‌రెడ్డికి ధ్రువపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారులు

మంచాల: మంచాల పీఏసీఎస్ చైర్మన్‌గా ఆరుట్ల గ్రామానికి చెందిన వెదిరె హన్మంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. గతంలో చైర్మన్‌గా పని చేసిన పుల్లారెడ్డిని అనర్హుడిగా ప్రకటించడంతో ఎన్నికలు నిర్వహించారు. 12 మంది డైరెక్టర్లు ఉండగా ఎనిమిది మంది వెదిరె హన్మంత్‌రెడ్డికి ఓటేయగా, నలుగురు మరో అభ్యర్థి జనార్దన్‌రెడ్డికి మద్దతుగా నిలిచారు. ఎన్నికల అధికారులు విజయ, శ్రీనివాస్, వెంకటేశ్, మంచాల పీఏసీఏస్ సీఈఓ చింతకింది శ్రీనివాస్, క్యాషియర్ రమేశ్, డైరెక్టర్లు పాల్గొన్నారు. హన్మంత్‌రెడ్డి గెలుపుతో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. ఈ క్యాక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు కొంగర విష్ణువర్దన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఎడ్మా నరేందర్‌రెడ్డి, కావలి శ్రీనివాస్, జయానంద్, నాయకులు రమాకాంత్‌రెడ్డి, సత్తయ్య, జంగయ్య, ధనుంజయ్య, బుగ్గ రాములు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చండి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, లబ్ధిదారులు

కందుకూరు: రెవెన్యూ పరిధిలో గతంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు చూపాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.రాంచందర్, మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కందుకూరు రెవెన్యూ పరిధి సర్వే నంబర్లు 788, 107లలో పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తూ సర్టిఫికెట్లు జారీ చేశారని తెలిపారు. కానీ ఇంత వరకు స్థలాలను చూపలేదని పేర్కొన్నారు. సొంతిళ్లు లేక పేదలు ఇబ్బంది పడుతున్నారని, కనీసం అద్దె కట్టని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని వెల్లడించారు. స్థలాలు చూపితే గుడిసెలు వేసుకుని నివసిస్తారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పేదోడి సొంతింటి కల నెరవేరేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.బాల్‌రాజ్, ఎ.కుమార్, ఆర్.శేఖర్, లబ్ధిదారులు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సులభంగా మెదడులో కణతుల తొలగింపు



- నూతన సాంకేతికతతో శస్త్రచికిత్సలు
- కామినేని ఆస్పత్రిలో రెండు రోజుల సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: మెదడులో కణతులను సులువుగా తొలగించేందుకు నూతన సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. ఎండోస్కోపిక్ స్కల్ బేస్ సర్జరీ ద్వారా ఈ ప్రక్రియ మరింత సులభతరం కానుంది. నూతన సాంకేతికతపై రెండు తెలుగు రాష్ట్రాల్లోని వైద్యులకు అవగాహన కల్పించేందుకు కామినేని ఆస్పత్రిలో రెండు రోజుల పాటు కెడావరిక్ వర్క్ షాప్ నిర్వహించారు. న్యూరో ఎండోస్కోపీ సర్జరీ గురించి వైద్యులు చర్చించుకున్నారు. దేశ వ్యాప్తంగా 120 మందికి పైగా వైద్యులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఢిల్లీ, ఛండీగఢ్ పీజీఐలు, నిమ్‌హాన్స్, ఎయిమ్స్ లాంటి ప్రఖ్యాత ఆస్పత్రులకు చెందిన ప్రొఫెసర్లు హాజరయ్యారు. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి స్కల్ బేస్ డైరెక్టర్లు జూమ్ మీటింగ్ ద్వారా హాజరయ్యారు. మెదడు మధ్య భాగంలో ఉండే కణతులను తొలగించాలంటే ముందుగా కపాలం పగలగొట్టి, కణతిని తొలగించాల్సి ఉంటుంది. ముక్కు ద్వారా అయితే చాలా సులభంగా కణతి ఉన్న ప్రాంతానికి చేరుకోవచ్చు. 2 సెం.మీ. మేర మాత్రమే కట్‌చేస్తే సరిపోతుంది. పిట్యుటరీ ట్యూమర్లు, స్కల్ బేస్ ట్యూమర్ల చికిత్స కోసం దీన్ని వాడుతారు. ఇలాంటి శస్త్రచికిత్స కోసం ఒకప్పుడు బెంగళూరు నిమ్‌హాన్స్, ఢిల్లీ ఎయిమ్స్ లాంటి ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ సాంకేతిక హైదరాబాద్‌లో కూడా అందుబాటులోకి వచ్చింది' అని సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించిన డాక్టర్ శిఘాకొల్లి రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ జలీల్, కోశాధికారి డాక్టర్ అరుముళ్ల శివసాయి, కామినేని ఆస్పత్రి సీవోవో డాక్టర్ గాయత్రి కామినేని, లక్నో ఎస్‌జీపీజీఐ ప్రొఫెసర్ ఆఫ్ న్యూరో సర్జరీ డాక్టర్ అవదేశ్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలి

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: జీహెచ్‌ఎంసీ, జలమండలి, సివరేజ్ బోర్డు అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధి సహారాస్టేట్స్ కాలనీలో 10 బ్లాక్ వద్ద డ్రైనేజీ మురుగు ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జడ్జెస్ కాలనీ నుంచి సహారాస్టేట్స్, ఆటోనగర్ రోడ్డు వరకు బాక్స్ డ్రెయిన్ నాలాలోని డ్రైనేజీ మురుగు రావడంతో తీవ్ర దుర్వాసనతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సహారాస్టేట్స్‌కాలనీ వెనుకవైపు ఆటోనగర్ రోడ్డులో బాక్స్ డ్రెయిన్ నాలా పనులు పూర్తికాకపోవడమే కాకుండా ఆటోనగర్ డంపింగ్‌యార్డ్ నుంచి వరద కాలువ నీటిని ఈ జంక్షన్‌లో కలపడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. హిమపురికాలనీ మీదుగా రూ.6.80 కోట్లతో చేపట్టనున్న వరద కాలువ పనులు త్వరగా మొదలయ్యే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సహారాస్టేట్స్‌కాలనీ మెయింటనెన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ జానీ, నాయకులు రవిచంద్ర, రాఘవేందర్, అమరనాథ్, విజయలక్ష్మి, రామన్‌గౌడ్, రాఖేశ్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఏలు లక్ష్మణ్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు కుమార్

ఆమనగల్లు: మండల పరిధిలోని పోలెపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు దోనాదుల కుమార్ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అలివేలమ్మ, రాములమ్మ, గ్రామ కార్యదర్శులు ఇందిరా, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని మాలెపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన చేయించారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఎస్‌ఐ రాజు



అవగాహన కార్యక్రమంలో ఎస్‌ఐ రాజు, విద్యార్థులు

తుర్కయంజాల్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆదిబట్ల ఎస్‌ఐ పి.రాజు తెలిపారు. శనివారం ఆయన శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో నిర్వహించిన యాంటి డ్రగ్స్ అవేర్‌నెస్ ప్రోగ్రాంకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడికి ప్రత్యేక పూజలు

తుక్కుగూడ: మునిసిపల్ పరిధి జిన్నాయిగూడ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు పాలు, పెరుగు, పుసుపు, కుంకుమ తదితర పానకాలతో అభిషేకం చేశారు. ప్రత్యేక అలంకరణ అనంతరం పూజులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు అజయ్‌శర్మ, మురళీ శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చెట్లను పరిరక్షించాలి

హస్తినాపురం: నాగార్జున సాగర్ రహదారిని ఆనుకుని ఉన్న కాలనీల్లో పెరిగి పెద్దదైన చెట్లను నరికివేయడంతో పర్యావరణానికి ఎంతో నష్టం జరుగుతుందని, అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి చెట్లను పరిరక్షించాల్సిన అవసరం ఉందని టీచర్స్ కాలనీ చెట్ల పరిరక్షణ కమిటీ కోఆర్డినేటర్ సన్నీ హెరాక్లియస్ అన్నారు. ఈ మేరకు శనివారం అటవీశాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. రోజురోజుకు పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ పెరిగిన చెట్లను కాపాడుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చొరవ చూపాలన్నారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి

- బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ తాలూకా కన్వీనర్ అనిల్
- టీజీపీఎస్సీ ముట్టడి, అరెస్టు



ఆందోళనకారులను రాణాకు తరలిస్తున్న పోలీసులు

తలకొండపల్లి: మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించి, జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే విడుదల చేయాలని బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ తాలూకా కన్వీనర్ అనిల్ డిమాండ్ చేశారు. విద్యార్థి నిరుద్యోగ సమస్యలపై బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్ పిలుపు మేరకు శనివారం హైదరాబాద్‌లోని టీజీపీఎస్సీని ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి, 25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలన్నారు. గ్రూప్ 2, గ్రూప్ 3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచి నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ముట్టడికి ప్రయత్నించిన బీజేవైఎం కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. అనిల్‌తో పాటు, ఆందోళనకారులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో పాలమూరు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, మధుకర్, పవన్, కుమార్, అనిల్, విజేందర్, చరణ్, రాజు, సురేష్, మహేష్, కర్ణాకర్, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో సామూహిక వ్రతాలు



టెస్కాబ్ వైస్ చైర్మన్ సత్తయ్యను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తుర్కయంజాల్: పౌర్ణమి సందర్భంగా శనివారం స్థానిక అయ్యప్ప ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ వ్రతంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

టెస్కాబ్ వైస్ చైర్మన్‌కు సన్మానం

టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య శనివారం స్థానిక అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. టెస్కాబ్ వైస్ చైర్మన్‌గా నియమితులైన తరువాత మొదటిసారి ఆలయానికి వచ్చిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. నర్సింహగౌడ్, ప్రభాకర్ గౌడ్, వెంకటేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారులతో సమీక్ష



ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆర్టీసీ అధికారులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న బస్సు సమస్యలను ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యాసంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల నుంచి పట్టణానికి పెద్దఎత్తున విద్యార్థులు చదువుకునేందుకు వస్తుంటారన్నారు. విద్యార్థులకు సమయానికి అనుకూలంగా బస్సు సౌకర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత ఆర్టీసీ అధికారులపై ఉందని పేర్కొన్నారు. ఏ గ్రామానికి బస్సు సమస్య రావొద్దని, పాత రూట్లలో బస్సు సర్వీసులను తిరిగి ప్రారంభించాలని సూచించారు. బస్సుల కొరత ఉన్నందున కొత్తగా ఏడు బస్సులను ప్రభుత్వం షాద్‌నగర్ డిపోకు కేటాయించిందన్నారు. త్వరలో మరో ఏడు బస్సులు రానున్నట్లు తెలిపారు. డిపోలో సిబ్బంది కొరత విషయమై మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సిబ్బంది కొరతను అధిగమించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో ఆర్టీసీ డిపో మేనేజర్ ఉష, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్య

అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాశాల సిబ్బంది

షాద్‌నగర్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నట్లు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ రెడ్డి అన్నారు. దోస్తు నోటిఫికేషన్ వెలుబడిన నేపథ్యంలో షాద్‌నగర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ప్రవేశాల కోసం శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కల్పిస్తున్న సదుపాయాల గురించి విద్యార్థులకు వివరించి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నాక్ బీ ప్లస్ గ్రేడ్ సాధించిందని, విద్యార్థులకు అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌తో పాటుగా ప్రొజెక్టర్లతో ఎంతో అనుభవం ఉన్న అధ్యాపకులతో పాఠాలను బోధిస్తున్నట్లు తెలిపారు. పోటీపరీక్షలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని, కళాశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. దోస్తు నోటిఫికేషన్ వెలుబడిన నేపథ్యంలో విద్యార్థులు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మొదటి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని కోరారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామంలో దివ్యశక్తి రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో రూ.40లక్షలతో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. షాద్‌నగర్ ప్రాంతంలో పారిశ్రామికవేత్తలు పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి పరిశ్రమలను స్థాపిస్తున్నారన్నారు. పరిశ్రమల యజమానులు స్వలాభాపేక్షతో కాకుండా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. తద్వారా సమాజంలో మంచి ఫలితాలు వస్తాయన్నారు. నిరుపేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని దివ్యశక్తి రౌండ్ టేబుల్ సంస్థవారు పాఠశాల భవనాన్ని నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థుల సంక్షేమానికి పరిశ్రమ వారు తమవంతు కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కౌన్సిలర్ కృష్ణవేణి, శ్రీశైలంగౌడ్, బాబర్‌ఖాన్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.